క్లుప్తంగా

వైభవంగా భువనేశ్వర స్వామి కల్యాణం



చెరుకుపల్లి: గూడవల్లి మైత్రేయ ఆశ్రమంలోని శ్రీ భువనేశ్వరి సమేత భువనేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. నూతన పంచలోహ విగ్రహాలను గూడవల్లి గ్రామానికి చెందిన గుమ్మడి హరి, పద్మావతి దంపతులు బహూకరించారు. ఇద్దరూ ఆలయంలో కల్యాణాన్ని బ్రహ్మశ్రీ చావలి శ్రీధర్ శర్మ, మల్లెల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో జరిగిన అన్నదానంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆశ్రమ నిర్వాహకురాలు నిర్మలమ్మ పర్యవేక్షించారు.

13న తిరుపతమ్మ తిరునాళ్ల

చెరుకుపల్లి: ఆరేపల్లి శివారు ఊచావారి పాలెంలో గల శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి తిరునాళ్లను ఈ నెల 13న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మొగిలి పువ్వు వీరాస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభలు, డప్పు వాయిద్యాలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కన్నుల పండువగా జనార్దనస్వామి కల్యాణం




కర్లపాలెం: భూనీలా సమేత జనార్దనస్వామి కల్యాణాన్ని సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న జనార్దన స్వామి ఆలయంలో అర్చకులు బృందావనం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు హనుమంతరావు, శ్రీవిద్య దంపతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణోత్సవాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు పరిమి దత్తాత్రేయశర్మ, శ్రీమన్నారాయణ, వరదరాజులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పార్థసారథి, వెంకట రామరాజు పాల్గొన్నారు.

వరదరాజ స్వామికి విశేష పూజలు



భట్టిప్రోలు (కొల్లూరు): పెదపులివర్రులోని వ్యాఘ్రపుర క్షేత్రంలో స్వయంభువులుగా కొలువైన శ్రీ వరదరాజస్వామి, శ్రీ రాజరాజనరేంద్ర స్వామికి ఏకాదశిని పురస్కరించుకొని సోమవారం ప్రాతఃకాల పూజలు ఘనంగా నిర్వహించారు. శుద్ధ ఏకాదశి పుష్యమి సందర్భంగా స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు



రేపల్లె రూరల్: ప్రజలు తమ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ రూపంలో అందించి తక్షణమే పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో నేలపు రామలక్ష్మి పేర్కొన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, అనంతరం మాట్లాడారు. పెన్షన్ కోసం ఒకటి, భూమి ఆన్‌లైన్ సమస్యలపై రెండు, ఆక్రమణల సమస్యపై ఒకటి చొప్పున మొత్తం నాలుగు దరఖాస్తులు అందాయని తెలిపారు. అర్జీలను పరిశీలించి ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరిస్తారని ఆమె పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

తెనాలి అర్బన్: మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామని కాల్వలు నిర్మించేలా చూడాలని 1వ వార్డుకు చెందిన కొందరు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అక్రమణలు తొలగించాలని కొందరు, ఇంటి పన్నులో లోపాలు ఉన్నాయని సరి చేయాలని ఒకరు, టిడ్కో నివాసాల వద్ద వాటర్ పైపుల లీక్‌లకు మరమ్మతులు చేయాలని మరొకరు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు అర్జీలు ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

యువత, విద్యార్థులకు వైఎస్సార్ సీపీ అండ

రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



నియోజకవర్గ నాయకులతో కలసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గణేష్

చెరుకుపల్లి: యువత, విద్యార్థులకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుందని రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పేర్కొన్నారు. సోమవారం గుళ్లపల్లిలోని క్యాంపు కార్యాలయంలో యువత పోరు పోస్టర్లను ఆయన నియోజక వర్గ నాయకులతో కలసి ఆవిష్కరించారు. సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బడిలో చేరిన చిన్నారుల దగ్గర నుంచి ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థుల వరకు మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన తల్లికి వందనం, విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యతో పాటు నిరుద్యోగ భృతి, యువతకు ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పేద విద్యార్థుల ఆశలను చంద్రబాబు నీరు కారుస్తూ ఉన్నత విద్య అందకుండా కుట్ర పూరిత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 12న 'యువత పోరు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించనున్నట్లు చెప్పారు. నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనిడాక్టర్ గణేష్ పిలుపునిచ్చారు. అదే విధంగా 12న వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుళ్లపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండా విష్కరణ ఉంటుందని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నేతలు యార్లగడ్డ మదన్‌మోహన్, బొర్రా శ్రీనివాసరావు, కాటూరి శివ, తోకల రాజా, చిమటా బాలాజీ, చిత్రాల ఒబేద్, వీసం నాగలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్లు ముండి వెంకట రామిరెడ్డి, యార్లబడ్డ రాంబాబు, రామకృష్ణ, శేషగిరిరావు, అనిల్, నాయకులు ప్రభు కిరణ్, చదలవాడ శ్రీను, లుక్కా బాసనియ్య, నిజాంపట్నం కోటేశ్వరరావు, వంగరు భాను పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు వెంటనే చెల్లించాలి

వేమూరు: కూటమి ప్రభుత్వం విద్యార్థులకు వెంటనే ఫీజు రియింబర్సుమెంటు బకాయిలు చెల్లించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దాది సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ఈ నెల 12న నిర్వహించనున్న యువత పోరులో విద్యార్థులు, యువకులు పాల్గొనివిజయవంతం చేయాలని ఆయన కోరారు.

యువత పోరును విజయవంతం చేయాలి

చుండూరు(వేమూరు): వైఎస్సార్ సీపీ ఈ నెల 12న తలపెట్టిన యువత పోరుబాటను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అనవరపు రఘురామిరెడ్డి కోరారు. మండలం నుంచి యువత కదలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

యువత పోరును విజయవంతం చేయాలి



కొల్లూరు : యువతను, నిరుద్యోగులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువత పోరును విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చేస్తున్న మోసాన్ని ఎదుర్కొనేందుకు వైఎస్సార్ సీపీ వారి తరఫున పోరాడుతుందని తెలిపారు. జిల్లా కేంద్రం బాపట్లలో ఈనెల 12న నిర్వహించనున్న యువత పోరుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

అంగన్‌వాడీల సమస్యలు సత్వరం పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయు నాయకులు

భట్టిప్రోలు (కొల్లూరు) : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను కూటమి ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని సీఐటీయూ భట్టిప్రోలు మండల కార్యదర్శి జి. సుధాకర్ డిమాండ్ చేశారు. విజయవాడలో సోమవారం చేపట్టిన మహా ధర్నాకు మద్దతుగా భట్టిప్రోలు రెవెన్యూ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ 42 రోజుల సమ్మె సందర్భంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, 1972 చట్టం ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్‌గా మార్చాలని, ఏడేళ్లుగా బకాయిలున్న టీఏ, డీఏ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు మనోజ్‌కుమార్, కౌలు రైతు సంఘం నాయకుడు గోళ్ల నాగరాజు, చేనేత కార్మిక సంఘం నాయకుడు గుడి సత్యనారాయణ, అంగన్‌వాడీ భట్టిప్రోలు మండల నాయకులు రమాదేవి, చెల్లమ్మ, రూపారాణి, సూర్యలక్ష్మి, మమత, రజిత, పుష్పలత పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ సుధాకర్

రేపల్లె రూరల్: విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సుధాకర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాలలకు ఎక్కువగా వచ్చేది పేద, మధ్యతరగతి ప్రజలేనని తెలిపారు. వారికి వైద్యసేవలు అందించడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్య వృత్తి సహనంతో కూడుకున్నదని, రోగులకు సక్రమంగా సేవలు అందించినప్పుడే వైద్యశాల సైతం అభివృద్ధికి నోచుకుంటుందని పేర్కొన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైద్యశాలలో గుండెకు సంబంధించిన ఇంజెక్షన్‌తో పాటు ఇతర మందులు అన్ని అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వైద్యశాల అభివృద్ధికి నివేదికను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశాల అభివృద్ధి కమిటీకి ఎంపికైన నూతన సభ్యులు డాక్టర్ రమేష్, ఆలపాటి వేణుగోపాలరావును సిబ్బందికి పరిచయం చేశారు. సమావేశంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే కృషి

బాపట్ల: మహిళల విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే కృషి అభినందనీయమని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక పాత బస్టాండ్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి సోమవారం నివాళి అర్పించారు.ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ మహిళలకు విద్యను అందించడమే ధ్యేయంగా ఆమె చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, నాయకులు సాయిల మురళి, కటికల యెహోషువా పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే ఆశయాలు ఆచరణీయం

కర్లపాలెం: సావిత్రీబాయి పూలే ఆశయాలు ఆచరణీయమని కర్లపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఇనకొల్లు పోలీస్‌రావు చెప్పారు. పాఠశాలలో సోమవారం సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్‌రావు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే మహిళలను చైతన్య పరచడంతో పాటు బాలికల విద్యను ప్రోత్సహించారని చెప్పారు. బాలికల చదువుల కోసం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు



నిందితుల వద్ద బ్యాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తెనాలి మండలం కఠెవరానికి చెందిన నీలకంఠం కృష్ణమూర్తి అలియాస్ కృష్ణ, కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన అతని పెదనాన్న కొడుకు నీలకంఠం ప్రభుకుమార్ అలియాస్ ప్రభు ఇద్దరూ గంజాయికి అలవాటు పడ్డారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరానికి చెందిన మల్లవరపు పృథ్వీ వీరికి గంజాయి విక్రయిస్తూ ఉండేవాడు. గంజాయి అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని పృథ్వీ వీరికి చెప్పడంతో అతని వద్ద 1.50 కిలోల గంజాయి కొనుగోలు చేసి తెనాలి తీసుకువచ్చి చిన్న పొట్లాలుగా చేసి విక్రయించేందుకు సిద్ధమయ్యారు. మున్సిపల్ కార్యాలయం పక్కన కాలువ కట్ట రోడ్డులోని ఆటో స్టాండ్ వద్ద సోమవారం విక్రయించేందుకు సిద్ధంగా ఉండగా సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ కె.రాములనాయక్ సిబ్బందితో కలిసి వెళ్లి వీరిని మధ్యవర్తుల సమక్షంలో అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు సమాచారం ఇచ్చి ఆయన సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేసిన సీఐ, సిబ్బందిని డీఎస్పీ బి. జనార్దనరావు అభినందించారు.

వైభవంగా శాంతి కల్యాణం



స్వామి శాంతి కల్యాణం జరుగుతున్న దృశ్యం



హాజరైన భక్తులు

తెనాలి: నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీగోవర్ధన స్వామి, వీరప్రతాప ఆంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం స్వామి శాంతి కళ్యాణం వైభవంగా జరిగింది. భక్తుల సహకారంతో స్వామి ముఖమండప పునర్నిర్మాణం పూర్తిచేసిన సందర్భంగా నాలుగురోజులుగా ఆలయంలో జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆదివారం జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపులో భాగంగా సోమవారం భక్తుల సమక్షంలో స్వామి శాంతి కల్యాణాన్ని జరిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎన్‌వీఎన్ మల్లేశ్వరి పర్యవేక్షణలో ఆలయ వంశపారంపర్య అర్చకులు టి.రఘు, వేదాంత మాధవభట్టాచార్యులు కార్యక్రమాలను జరిపించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల కుటుంబసభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, ఆత్రేయ, కేశవ, నరసింహభట్టాచార్యులు, యశ్వంత్, అనంతచార్యులు, రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

హ్యాకింగ్‌పై ఓటీటీ చిత్ర నిర్మాణం



సమావేశంలో మా ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు దిలీప్‌రాజా

తెనాలి టౌన్: ప్రపంచాన్ని వణికిస్తున్న హ్యాకింగ్ మోసాలపై తెనాలి పట్టణానికి చెందిన నూతన దర్శకులు దోనే నరేష్, మణి వరుణ్ ఓటీటీ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మా ఏపీ వ్యవస్థాపక అధ్యకక్షుడు దిలీప్‌రాజా తెలిపారు. సోమవారం మా ఏపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర వివరాలను వెల్లడించారు. దేశ వ్యాప్తంగా సైబర్ క్రైమ్ పోలీసులకు సవాలుగా మారినందున ఈ నూతన కథాంశాన్ని ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. చిత్రాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మళయాళ భాషల్లో అందించనున్నట్టు వివరించారు. అనుపమ ఆర్ట్స్ పతాకంపై రూపొదుతున్న చిత్రానికి నిర్మాతగా రావూరి సురేష్‌బాబు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. యువ దర్శకులు ఇద్దరు కోటప్పకొండ ఓటీటీ చిత్రంతో పరిచయమైనట్లు గుర్తు చేశారు. సమావేశంలో కాస్ట్యూమ్ డిజైనర్ పట్నాల పార్వతి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళలపై ఆసక్తి పెంచుకోండి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కృష్ణ, శ్రీనివాస్

తెనాలి అర్బన్: కళల పట్ల కొందరికి ఆసక్తి ఉంటుందని, అలాంటి వారిని ప్రోత్సాహించాల్సిన అవసరం విద్యాసంస్థలపై ఉందని ప్రముఖ హార్మోనిస్ట్ బి.కృష్ణ, డ్యాన్స్ మాస్టర్ జె.శ్రీనివాసులు పేర్కొన్నారు. జేఎంజే మహిళా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోపాటు ఆసక్తి ఉన్న రంగంలో రాణించాలని సూచించారు. అనంతరం ఫోక్ డ్యాన్స్, స్టోరి టెల్లింగ్, సోలో సాంగ్స్ వంటి పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా విజ్ఞాన్ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ ఎం.విమలాదేవి, కె.అరుణోదయ వ్యవహరించారు. గుంటూరులోని జేకేసీ కాలేజ్, ఏసీ కాలేజ్, హిందూ కాలేజ్, టీజేపీఎస్ కాలేజ్, తెనాలిలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల, వీఎస్సాఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల, గుప్తా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల కమిటీ కన్వీనర్ డాక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ షైనీ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ మేరి శారద, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీనారాయణ కల్యాణం



శ్రీలక్ష్మీనారాయణ కళ్యాణం

తెనాలి: స్థానిక కొత్తపేటలోని తాలూకా హైస్కూల్ మైదానంలోని ప్రత్యేక వేదికపై అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈనెల 14 వరకు నిర్వహించే ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా సోమవారం గోపూజతో కార్యక్రమాలను ఆరంభించారు. శ్రీలక్ష్మీనారాయణ కల్యాణాన్ని భక్తుల సమక్షంలో నేత్రపర్వంగా జరిపారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు రామానుజ దాసి పసుమర్తి పద్మజాకుమారి శ్రీరాముడి గుణగణాలను వివరించారు. బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణమూర్తి తన ప్రవచనంలో పంచముఖ ఆంజనేయస్వామి సద్గుణాలను వివరించారు. వైఖానస పండితులు నారాయణ గోవర్ధన్ లక్ష్మీ రఘురాం, వేదాంతం నాగ మారుతి, రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆర్.వి.కిరణ్, సురేష్ బృందం వేదాగమ పూజలు చేశారు. సాయంత్రం విద్యార్థులు ఉచిత సామూహిక శ్రీసరస్వతీదేవి పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ములుకుట్ల విశ్వనాథ శర్మ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భగవద్ రామానుజ దాసుడు జంధ్యం రామారావు దంపతులు భక్తి పూర్వక సహకారం అందించారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణ జరిగాయి. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవాసమితి, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి అనురాధ, వెంకటేశ్వరరావు ,గుడివాడ బాలకృష్ణ , మడుపల్లి చంద్రశేఖర్, మాజేటి వెంకటేష్, గోలి సోమశేఖర్ పర్యవేక్షించారు.

అనుమతి లేకుండా ఇసుక తరలింపు

దుగ్గిరాల: దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామంలో సోమవారం చెరువు గట్టుకు పోసిన ఇసుకను అనుమతి లేకుండా, అక్రమంగా కొందరు తవ్వుతున్నట్లు సర్పంచ్ గంపల గంగాధరరావు తెలిపారు. 1.80ఎకరాలలో గల శ్మశాన స్థలంలో 2021 నవంబర్ 19న అక్రమ షాపులను తొలగించి, చదును చేసి గ్రామాభివృద్ధి కోసం ఉపయోగించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఇప్పుడు అదే స్థానంలో మళ్లీ యథావిధిగా షాపులు నిర్మించారని పేర్కొన్నారు. పక్కనే ఉన్న చెరువు చుట్టూ ఇసుకపోసి వాకింగ్ ట్రాక్ వేసి ఆధునీకరణ చేయాలని పంచాయతీ తీర్మానం చేసిందని తెలిపారు. ప్రభుత్వ అండదండలతో వాకింగ్ ట్రాక్‌కు వేసిన ఇసుక, మట్టిని అనుమతి లేకుండా కొందరు నేతలు పొక్లెయిన్‌తో తరలిస్తున్నారని ఆరోపించారు. అక్రమ తవ్వకాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని గంగాధరరావు కోరారు.

ఫిర్యాదులు రాకుండా చూసుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: చెత్త సేకరణపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, అవి రాకుండా ఉద్యోగులు చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 14వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అక్కడక్కడ వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆయన వెంట హార్టీకల్చర్ ఆఫీసర్ శేషుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ ఉన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రేపల్లె రూరల్: బీసీ వార్షిక ప్రణాళికలో భాగంగా బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ ఉప కులాలకు చెందిన కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణులలోని పేద మహిళలకు ప్రభుత్వం మూడు నెలల పాటు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 శాతం హాజరుతో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టుమిషన్ అందిస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు ఈ నెల 31వ తేదీలోపు సచివాలయంలో ఆన్‌లైన్‌లో (ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కేంద్రాన్ని పట్టణంలోనే ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం



నగరం: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని చౌర్యానికి, దానికి పాల్పడితే భారీ జరిమానా విధించనున్నట్లు బాపట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. భాస్కరరావు చెప్పారు.మండలంలోని పలు గ్రామాలలో సోమవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ మండలంలోని 2995 సర్వీసులను 48 బృందాలు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇందులో 188 మందిపై కేసులు నమోదు చేసి రూ. 8.49లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అదనపులోడు వినియోగిస్తున్న 177 మందిపై రూ. 8లక్షల జరిమానా విధించగా, మాల్ ప్రాక్టీస్ కింద 10 కేసులకు రూ. 46000, డైరెక్ట్ ట్యాపింగ్‌కు రూ. 3000 అపరాధ రుసుం విధించినట్లు ఆయన వెల్లడించారు.భద్రత ప్రమాణాలు పాటిస్తూ విద్యుత్‌ను సమర్థంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. రూఫ్‌టాప్ పీఎం సూర్యా ఘర్ ద్వారా సోలార్ సహజ విద్యుత్‌ను వాడటం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంతో పాటు బిల్లులను తగ్గించుకోవచ్చునని తెలిపారు. ఏపీటీఎస్ సీఐ వెంకన్నచౌదరి మాట్లాడుతూ ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో చెరుకుపల్లి, పొన్నూరు, బాపట్ల డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్. సురేష్, జి. శ్యాంకుమార్, ఆర్. విజయ్‌శ్రీనివాస్‌లు, ఏఈ ఎండీ నాగుల్‌మీరా పాల్గొన్నారు.

హిందువులపై దాడులను అరికట్టాలి



బాపట్ల: హిందువులపై జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోవాలని హిందూ చైతన్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు.బాపట్ల పట్టణంలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు పుల్లగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ హిందువుల మీద జరుగుతున్న ఏకపక్ష దాడులను తీవ్రంగా ఖండించారు. గత ఆరు నెలల్లో పెడన, రాయచోటి, వి.కోట, దాచేపల్లి ప్రాంతాల్లో ముస్లిం ఉగ్రవాదులు దాడులు చేశారని దుయ్యబట్టారు. రాయచోటిలో హిందువులు సంప్రదాయంగా వీరభద్రస్వామి దేవాలయంలో నిర్వహించుకుంటున్న పార్వేటలో కొంతమంది దాడులు చేయటం దురదృష్టకరమని ఖండించారు. వీటిపై విచారణ చేపట్టాలని కోరారు.అనంతరం జేసీకి వినతి పత్రం అందించారు. నిరసనలో జి.వి.ఎల్.మోహన్‌గౌడ్, మారుతీరామ్ పాల్గొన్నారు.